ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 9 మార్చి 2024





శంభో శంకర

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అంతటా మార్మోగిన శివనామస్మరణ



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్ర కోటేశ్వరుడికి అభిషేకం

(శ్రీకాకుళం కల్చరల్/టెక్కలి/జలుమూరు)

మహాశివరాత్రి పర్వదినం వేళ.. శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఏ ఆలయం చూసినా భక్తుల రద్దీ కనిపించింది. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ.. శివనామస్మరణ మార్మోగింది. దీపారాధనలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీకాకుళం గుడివీధిలోని శ్రీకాకుళం గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయానికి శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి అరగోపాల్ శర్మ, శ్రీరామ్మూర్తి శర్మ, చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ నిర్వాహకులు భక్తులకు తాగునీరు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. టెక్కలి మండలం రావివలసలో ఎండలమల్లికార్జున స్వామిని శుక్రవారం ఉత్కళాంధ్రులు వేల సంఖ్యలో దర్శించుకున్నారు. ఆంధ్రాతోపాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎండలమల్లన్న.. చల్లగ చూడన్నా అంటూ పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు.. తన సతీమణి విజయమాధవితో కలిసి ఎండలమల్లన్నకు మహా రుద్రాభిషేకం చేశారు. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం.. భక్తజన సంద్రమైంది. శ్రీముఖలింగేశ్వరస్వామితో పాటు సోమేశ్వర, భీమేశ్వరాలయాల్లో కూడా భక్తులు పూజలు చేశారు. అలాగే మందస సమీపాన తూర్పుకనుమల్లోని మహేంద్రగిరులు జనసంద్రమయ్యాయి.



జలుమూరు : శ్రీముఖలింగేశ్వరుడికి పూజలు



శ్రీముఖలింగంలోని ప్రత్యేక దర్శనం క్యూలో భక్తుల రద్దీ



ఉమారుద్ర కోటేశ్వరాలయ సన్నిధిలో భక్తులు



టెక్కలి : ఎండలమల్లన్నకు రుద్రాభిషేకం చేస్తున్న అచ్చెన్నాయుడు దంపతులు



ఎండలమల్లన్నకు పూజలు చేస్తున్న భక్తులు



నందిగాం: శివాలయంలో మహిళల దీపారాధన

ఆదిత్యుని తిరువీధి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామికి శుక్రవారం సాయంత్రం శేష వాహనంపై తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అలంకరించి ఊరేగించారు.





పలాస : మహేంద్ర గిరులపై విద్యుత్ వెలుగులో ధర్మరాజు ఆలయం, భక్తుల సందడి

కోతుల స్మగ్లర్లకు 14 రోజుల రిమాండ్



పట్టుబడిన స్మగ్లర్లు

పలాస, మార్చి 8: ఉగాండా దేశానికి చెందిన రెండు అరుదైన మౌంటైన్ మంకీ(కోతులు)లను స్మగ్లింగ్ చేస్తున్న సౌరబ్‌మండల్, ధనుంజయ్‌సింగ్, ముఖేష్‌రామ్‌లను ఇచ్ఛాపురం కోర్టులో హాజరుపరిచారు. వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు కాశీబుగ్గ అటవీశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 'అసోం రాష్ట్రానికి ఈ కోతులను స్మగ్లర్లు చేర్చారు. అక్కడ నుంచి కోల్‌కతా వ్యాపారులు కొనుగోలు చేసి చెన్నై తరలిస్తుండగా గురువారం ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద అటవీ సిబ్బంది పట్టుకున్నారు. ఒక ఆడ, మగ కోతులను రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ జాతి కోతులు అంతరించిపోతున్నాయి. సంతానోత్పత్తికి లేదా మరే ఇతర కారణాలవల్ల తరలిస్తున్నారా? అన్నది దర్యాప్తులో తేలుతుంది. కోతులను మా సంరక్షణలోనే ఉంచాం. మొత్తం స్మగ్లర్లు ఎంతమంది ఉన్నారన్న విషయంపై దర్యాప్తు కొనసాగుతోంద'ని తెలిపారు.

స్వేచ్ఛ కోసం మహిళలు పోరాడాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి

అరసవల్లి, మార్చి 8: మహిళా దినోత్సవ స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ కోసం మహిళలు పోరాడాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మహిళల సమస్యలు, కర్తవ్యాలు అనే అంశంపై సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయడంతోనే స్వేచ్ఛవైపు మహిళా ప్రయాణం సాధ్యమైందన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేయాలని కార్పొరేట్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. శ్రామిక మహిళలపై శ్రమదోపిడీ, లైంగిక దోపిడీ నానాటికీ తీవ్రమవుతున్న నేపథ్యంలో హక్కులు, పనిభారం నుంచి విముక్తి కోసం పోరాట బాట పట్టాలని పిలుపునిచ్చారు. సదస్సుకు బి.ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దిశ పోలీసుస్టేషన్, శ్రీకాకుళం ఏఎస్ఐ కె.రేణుకరాణి, ఐసీసీ జిల్లా ఛైర్మన్ ఎం.వాగ్దేవి, శ్రామిక మహిళా, ఐద్వా జిల్లా కన్వీనర్లు ఏ.మహాలక్ష్మి, ఏ.లక్ష్మి, శ్రీకాకుళం డిగ్రీ కాలేజీ లెక్చరర్ స్వర్ణలత, సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు పి.తేజేశ్వరరావు, ఎస్.కిషోర్‌కుమార్, బి.శ్రీరామ్మూర్తి, చందు, హరీష్, పి.పవిత్ర, పి.శ్రీదేవి, ఎం.లలిత, జి.గిరిధర్, వీజీకే మూర్తి, పొందూరు అప్పారావు పాల్గొన్నారు.

ఎలా జరిగిందో..

- గ్రానైట్ క్వారీ కార్మికుడి మృతి
- ఘటనపై అనుమానాలు



అప్పారావు (ఫైల్)

టెక్కలి, మార్చి 8: లింగాలవలస సమీపంలో సర్వే నెం.71లో ఎర్త్‌స్టెయిన్ గ్రానైట్ క్వారీలో శుక్రవారం ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన పలు అనుమానాలకు దారితీస్తోంది. గ్రానైట్ క్వారీలో మేస్త్రీగా పనిచేస్తున్న రావాడ అప్పారావు(44) శుక్రవారం విధులకు హాజరై అనారోగ్యానికి గురయ్యాడు. తోటి సిబ్బంది ఆయనను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడని క్వారీ యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు. మరోవైపు క్వారీలో కొందరు కార్మికులు బ్లాకును డ్రిల్ చేస్తుండగా.. పక్క నుంచి వెళ్తున్న అప్పారావు జారిపడి మృతి చెందాడని సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా అప్పారావు సుమారు ఉదయం 11గంటలకు మృతి చెందగా.. సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సీఐ పి.షైడయ్య వద్ద ప్రస్తావించగా.. క్వారీలో కార్మికుడు మృతి చెందిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

- అప్పారావు స్వగ్రామం కోటబొమ్మాళి మండలం రేగులపాడు. ఈయనకు తల్లి నారాయణమ్మ, భార్య పుణ్యవతి, పిల్లలు సుజాత, శివ ఉన్నారు. శుక్రవారం ఇంటి నుంచి విధులకు వెళ్లిన కొద్దిగంటల్లోనే అప్పారావు మృతి చెందాడని సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రేగులపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

భద్రతా ప్రమాణాలు డొల్ల..

ఈ ఘటనతో గ్రానైట్ క్వారీలో భద్రతా ప్రమాణాల డొల్లతనం మరోసారి బట్టబయలైంది. సేఫ్టీమేనేజర్ స్థాయి ఉద్యోగులు క్వారీ నిర్వహణ పనులు పర్యవేక్షించాలి. కానీ ఆ పరిస్థితి పలు క్వారీల్లో కనిపించడం లేదు. రికార్డుల వరకు మాత్రమే సేఫ్టీ మేనేజర్ ఉద్యోగులు ఉన్నట్లు చూపుతున్నారు. క్వారీల్లో తరచూ ప్రమాదాలు జరగడం, మైన్స్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



జమ్ము వద్ద ఇంజన్ల ద్వారా నీరు అందిస్తున్న రైతు

వరి రైతుకు సాగునీటి కష్టాలు

- పంటను కాపాడుకునేందుకు అవస్థలు

(నరసన్నపేట)

రబీ సీజన్‌లోనూ అన్నదాతలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. సక్రమంగా సాగునీరు అందక వరిపంట పొలాలు ఎండిపోతున్నాయి. వంశధార కాలువ దిగువన నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల్లో సుమారు 7వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. కాగా.. వంశధార కాలువ ద్వారా సాగునీరు అందక పంటను కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. సమీపంలో చెరువుల్లో నీటిని ఇంజన్ల ద్వారా పంటకు అందిస్తున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో నీటి తడులు చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెడ్డికపేట, గొట్టిపల్లి, కరగాం, నర్సింగపల్లి, జమ్ము, కంబకాయి. టెక్కలిపాడు, బసివాడ, గుగ్గిలి, వెలుసొద, తాళ్లవలస, పాగోడు, జలుమూరు, బద్రి, గోపాలపురం తదితర గ్రామాల్లో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు. వంశధార నదిలో వృథాగా నీటిని విడిచిపెట్టకుండా.. ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు లేకపోవడంతో కాలువల్లోకి నీరు విడిచిపెట్టడం లేదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.



జలుమూరు మండలం టెక్కలిపాడు వద్ద ఎండిపోతున్న వరిపైరు

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, మార్చి 8: జిల్లాలోని ఎస్.ఎం.పురం(బాలురు), వమరవల్లి(బాలికలు) గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సమన్వయకర్త, ఎస్.ఎం.పురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.శివప్రసాద్ తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. వచ్చే నెల 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి ప్రవేశానికి, అలాగే 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు ఇంటర్మీడియట్, డిగ్రీలో ప్రవేశానికి అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్ష జరుగుతాయని చెప్పారు.

డ్వాక్రా మహిళలకు దువ్వాడ తాయిలాలు

మహిళా దినోత్సవం సందర్భంగా వైసీపీ నేత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ డ్వాక్రా మహిళలకు తాయిలాల రూపంలో చీరలు పంపిణీ చేశారు. శుక్రవారం టెక్కలిలోని తన కార్యాలయంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధుల సన్మానం పేరిట పనిలో పనిగా 500మంది డ్వాక్రా మహిళలను పిలిచారు. కవరుపైన 'జై జగన్.. జై దువ్వాడ, ఫ్యాన్ గుర్తుకే మీ ఓటు' అంటూ ఓ స్టిక్కర్ అతికించి వారికి చీరలు అందజేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీకి సహకరించాలని కోరడం చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతాడ మంజు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, టెక్కలి సర్పంచ్ గొండేల సుజాత, కోత ఇందిర, రాజేశ్వరి ఉన్నారు.

\- టెక్కలి







పంట కాలువ కబ్జా

- ప్రభుత్వ భూమిలో వైసీపీ నాయకుడు

అక్రమ నిర్మాణాలు

పొందూరు మండలం బీకంచరాంలో ఓ వైసీపీ నాయకుడు పంట కాలువను కబ్జా చేశాడు. సిమెంట్ ఇటుకల పరిశ్రమ వద్ద ప్రభుత్వ భూమిలో పునాదులు వేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు. అయినా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తహసీల్దార్ ఎం.కిరణ్‌పాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిర్మాణాలను పరిశీలించాలని వీఆర్వోకు ఆదేశించామని తహసీల్దార్ కిరణ్‌పాల్ తెలిపారు. కాలువలో నిర్మాణాలు చేపడుతున్నట్టు నిర్ధారణ అయితే ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

\- పొందూరు

ఓం నమశ్శివాయ

- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి
- అభిషేకాలు, విశేష సేవలు
- ఘనంగా లింగోద్భవం
- గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత




హరిపురం: మహేంద్ర గిరుల్లోని కుంతీదేవి ఆలయం వద్ద భక్తుల రద్దీ

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారు జామునుంచే భక్తులు శివాలయాలను సందర్శించి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. రుద్రాభిషేకాలు, భజనలు, భక్తిసంగీత విభావరులు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయాల నిర్వాహకులు చర్యలు చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత లింగోద్భవ కార్యక్రమాన్ని విశేషంగా చేపట్టారు. ఓం నమశ్శివాయ, హరోంహర, హరహర మహాదేవ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న వారిలో శ్రీకాకుళం, పలాస ఆర్డీవోలు సీహెచ్ రంగయ్య, భరత్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఉన్నారు. ఎండల మల్లన్నను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, డీసీ ఎస్.సుజాత, ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఆలయ కమిటీ ఛైర్మన్ సర్లాన సుధాకర్, టీడీపీ నేతలు ఎల్ఎల్ నాయుడు, లక్ష్మి, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పినకాన అజయ్‌కుమార్, చాపర గణపతి తదితరులు దర్శించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని సేవలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధి ఉమా జలలేశ్వర స్వామి



అర్ధనారీశ్వరునిగా నానుబాల వీధిలోని విజయదుర్గమ్మ



బొందిలీపురంలోని తుల్జాభవానీ అమ్మవారి అలంకరణ



టెక్కలి: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అచ్చెన్నాయుడు



హిరమండలం: దుర్బలాపురం శివాలయంలో సామూహిక రుద్రాభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



పలాస: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో



కాశీబుగ్గ: శివాలయంలో అన్న ప్రసాద వితరణ



పలాస రూరల్: మహదేవపురం వద్ద..



పాతపట్నం: జోగికొండపై జోగీశ్వరుని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్త సందోహం



అరవల్లి: ఆదిత్యాలయంలో మహా లింగార్చన



గార: అంపోలు అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో..



టెక్కలి: ఎండల మల్లన్నను దర్శించుకుంటున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో..



ఎల్ఎన్‌పేట: రావిచెంద్రి శివాలయంలో కల్యాణం



లావేరు: చినమురపాక విశ్వేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు



ఇచ్ఛాపురం: రామలింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు



పొందూరు: బొట్లపేట ఎండల మల్లన్న ఆలయం వద్ద..



సంతబొమ్మాళి: గొదలాం శివాలయం వద్ద..



సోంపేట: విద్యుత్ వెలుగుల్లో పలాసపురం కపిలవస్తు ఆలయం



మెళియాపుట్టి: చాపర శివాలయంలో క్యూలైన్



పోలాకి: దీర్ఘాశి శివాలయం వద్ద క్యూలో ..



రణస్థలం: బంటుపల్లి మల్లన్న ఆలయంలో..



సరుబుజ్జిలి: గేదెల వానిపేట శివాలయంలో..



ఎచ్చెర్ల: ఎస్ఎం పురం శివాలయంలో..



నరసన్నపేట: జ్యోతిర్లింగాల దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



బూర్జ: శివాలయం వద్ద క్యూలో భక్తులు

కన్నుల పండువగా లింగోద్భవం



లింగోద్భవం తొలి పూజలో పాల్గొన్న పర్లాకిమిడి యువ రాణి కల్యాణ గజపతి వర్మ

జలుమూరు: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత లింగోద్భవ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. గణపతి పూజ, శాంతిమంత్రం, కలశారాధన, రుద్ర బిల్వార్చన, మహారాజ పట్టాభిషేకం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు చేపట్టారు. పర్లాకిమిడి యువరాణి కల్యాణి గజపతి వర్మతో పాటు మహారాజు వంశం తరఫున అర్చకుడు శరత్ చంద్ర పండా పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. బంగారు, వెండి పుష్పాలతో పాటు 108కొబ్బరి కాయలతో అభిషేకం చేశారు. అనంతరం లింగం మునిగేవరకు బియ్యం పోసి లింగోద్భవ కార్యక్రమం చేపట్టారు. సంప్రదాయ ప్రకారం శ్రీముఖలింగేశ్వరుని గర్భగుడి శిఖరంపై శిఖర దీపం వెలిగించి పాగా గావంచాను వినాయక విగ్రహం వరకు వేలాడదీసి పూజలు చేశారు. అంతకుముందు గ్రామంలో స్వామి తిరువీధి కన్నుల పండువగా చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, ఎంపీటీసీ హరిప్రసాద్, ఈవో ప్రభాకరరావు, అర్చకులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మధుసూదనరావు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మహిళా రక్షణ చట్టాల అమలులో నిర్లక్ష్యం

మెళియాపుట్టి: మహిళలకు రక్షణగా రూపొందించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బడకల ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సవరజాడుపల్లిలో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు రక్షణగా ఉన్న 498-ఎ లాంటి చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. పోరాటాలతోనే వీటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సవర కుమారి, సుహాసిని, సోమేష్, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకుడు వంకల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి

పాతపట్నం: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని నియోజకవర్గ పార్టీ నాయకుడు కొప్పురోతు వెంకటరావు అన్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

టెక్కలి, హిరమండలంలో చిరుజల్లులు

టెక్కలి/హిరమండలం: చాలారోజుల తరువాత శుక్రవారం సాయంత్రం టెక్కలి, హిరమండలం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. వర్షం కోసం ఎదురుచూస్తున్న ప్రజానీకం ఈ చిరుజల్లులతో ఉపశమనం పొందారు. హిరమండలంలో సుమారు 15 నిమిషాల పాటు వర్షం పడింది. మహాశివరాత్రి రోజున వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర

నందిగాం: నందిగాంలో గ్రామదేవత నీలమణిదుర్గ ఆలయ పునః ప్రారంభం సందర్భంగా గురువారం రాత్రి సత్య హరి శ్చంద్ర పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. రాష్ట్ర స్థాయి కళాకారులు వివిధ పాత్రలను పోషించి ఆహూతులను అలరించారు.కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ చిన్న బ్రాహ్మణ వీధిలో కంచికామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వ ర్యంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



సూపర్‌సిక్స్‌పై ప్రచారం నిర్వహిస్తున్న రవికుమార్

సరుబుజ్జిలి: సైకో సీఎం జగన్‌రెడ్డి పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఫకీరుసాహెబ్‌పేట, అలాజీపేట, సీతారాం నగర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన బాబు ష్యూరిటీ, సూపర్‌సిక్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అందించనున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కిల్లి సిద్దార్థ, శివ్వాల సూర్యనారాయణ, లావేటి పున్నారావు, పైడి మురళీమోహన్, తాడేల వెంకటరమణ, కందుల వెంకటరావు, రాజీవ్, పాతిన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

జలుమూరు: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బద్రి, చీడిపూడి గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నిక్కు జనార్దనరావు, కింజరాపు రామారావు, బలగ భాస్కరరావు, డి.జయరాం, చల్ల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్‌కు గ్యారెంటీ

జి.సిగడాం: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే యువతకు, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు అన్నారు. శుక్రవారం పెంట, నాగులవలస, బాతువ, డీఆర్ వలస, పెనసాం, దేవరవలస, నడిమివలస తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోని వివరించి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మీసాల విజయమ్మ, పైల రామకృష్ణంనాయుడు, మీసాల అశోక్, సిరిపురపు ఉపేంద్ర, నేదూరి సురేష్, ఎండమూరి దుర్గాప్రసాద్, కంబాల ఈశ్వరరావు, కోనారి బాలకృష్ణ, ఎండమూరి అప్పారావు, టొంపల గవరయ్య తదితరులు పాల్గొన్నారు.





జి.సిగడాం: పెంట, సారవకోట మండలం చీడిపూడిలో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించాలి



కళాకారిణులకు బహుమతి అందిస్తున్న ఎస్పీ

పలాసరూరల్: మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించడం ద్వారా ఉన్నత స్థానా లను అధిరోహించాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. రెంటికోట గ్రామంలో శుక్రవారం అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు విద్య, ఇతర అంశాల్లో ఉన్నతి సాధించాలని, సామాజిక మాధ్యమాలు, ఇతర వ్యాపకాల్లో పడి జీవితాన్ని వృథా చేసుకో వద్దన్నారు. అంతర్జాతీయంగా మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని అయితే చిన్నపాటి కుటుంబ తగాదాల వల్ల ఇతర అంశాలకు ఆకర్షితులై జీవితాన్ని పక్క దారి పట్టకూడదన్నారు. మహిళలు వేసే ప్రతీ అడుగు ఆచితూచి వేయాలని, ఇతరుల మాటలు నమ్మి మోసపో వద్దన్నారు. ప్రమాదంలో ఉండే మహిళలు దిశ యాప్‌ను ఓపెన్ చేసి ఐదుసార్లు మొబైల్‌ను కదిలిస్తే దగ్గరలో ఉన్న ఎస్‌హెచ్‌వోకు మీ వివరాలు అందడం ఆపద నుంచి బయట పడవచ్చన్నారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలకు చీరలు, బాలికలకు శానిటరీ కాస్మెటిక్స్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకటుకున్నాయి. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ ఎల్‌హెచ్ విజయానంద్, సర్పంచ్ శాసన పురి తిరుమల, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, టెక్కలి బ్రాంచ్, టెక్కలి వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, రఘునాధపురం గ్రామం కాపురస్తుడైన **శ్రీ కవిటి రాజు S/o వాసుదేవరావు** వీరి ప్రోపర్టీని పూరిటీగా తనుకొని వీరికి రుణమునకు హామీగా అతని స్వాధీన, హక్కు అనుభవము లోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరెవ్వరికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టి వారు ఈ నోటీసు ప్రచురించబడిన ఏడు దినములలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తి పైగాని, దానిపై జరపబోవు తాకట్టుపైగాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావించబడునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది. **షెడ్యూలు:** శ్రీకాకుళం జిల్లా, టెక్కలి స.రి.వారి యిలాకా, టెక్కలి మండలం, టెక్కలి పంచాయితీ, రఘునాధపురం గ్రామంలో యున్న 11వ వార్డులో గల ఆది ఆంధ్ర వీధికి పోయే రోడునకు దిశలోయున్న సర్వే నెం. 416/3బి పూరా య.6-23 సెంట్లలో దక్షిణ దిశలో మధ్యమ శె 0-10 సెంట్లు అనగా తూ॥ప॥లకు 42అ॥లు (12.796మీ॥), ఉ॥ద॥లకు 90అ॥లు (27.420మీ॥) అనగా మొత్తం 420చ॥గ॥ కల్గియున్న జి.స్థలానికి **హద్దులు: తూ:** మా తాలూకా జి.స్థలం, **ప:** గేదెల అప్పలనూరమ్మ జి.స్థలం, **ద:** 10అ॥ వెడల్పు గల రోడ్డు, **ఉ:** డ్రైనేజ్.

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

టీడీపీతోనే మహిళా సాధికారత

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆమదాలవలస: టీడీపీ పాలనలోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మాట్లాడారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన డ్వాక్రా సంఘాలతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించారన్నారు. ఇప్పుడు 'కలలకు రెక్కలు' అనే కొత్త పథకానికి మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకం ద్వారా ఆడబిడ్డ చదువులకు ఆటంకం ఉండదన్నారు. కార్య క్రమంలో నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి, మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, ఎన్ని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన యువకులు రవికుమార్ సమక్ష్యంలో టీడీపీలో చేరారు.


ఆమదాలవలస: మాట్లాడుతున్న కూన రవికుమార్

నర్సుల సేవలు వెలకట్టలేనివి


కార్యక్రమంలో పాల్గొన్న నర్సులు, వైద్యులు

అరసవల్లి: వైద్యవృత్తిలో నర్సుల సేవలు వెలకట్టలేనివని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు వారి అవసరాలను గుర్తించి, ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా అందించే సేవల్లో ముఖ్య భూమిక నర్సులదేనని కొనియాడారు. ఎస్ఐ ప్రవళ్లిక మాట్లాడుతూ.. నర్సుల సేవలు, వారి త్యాగాలు మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా నర్సులను, మహిళా వైద్యులను సత్కరించారు.

మండల మహిళా ఆధ్వర్యంలో..

ఇచ్ఛాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మండల మహిళా సమైఖ్యలో ఘనంగా జరిపారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏపీఎం సనపల ప్రసాద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల హక్కుల ఉద్యమంలో కేంద్ర బిందువుగా ప్రతీ ఏటా మార్చి 8న జరుపుకుంటున్నామన్నారు. అనంతరం మహిళలను సత్కరించారు.

మహిళల అభ్యున్నతికి కృషి

బూర్జ: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడు సామాజిక ప్రగతి సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పెద్దపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో స్పీకర్ పాల్గొని మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన మహిళలకు, నామినేటెడ్ పదవుల్లో నియామకం పొందిన మహిళలకు ప్రభుత్వ ఉద్యోగినులను ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో ఎంపీపీ కర్ణదీప, వైసీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ కళామందిర్‌లో..

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో అంతరాత్జీయ ఉమెన్స్ డే కెరీర్ ఫెయిర్, సిక్కోలు ఫ్యూచర్ సింగర్స్ సంస్థల ఆధ్వర్యంలో నృత్య దర్శకురాలు నీరజా సుబ్రమణ్యాన్ని ఘనంగా సన్మానించారు. అలాగే 80 అడుగుల రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో డాన్స్ ప్లానెట్స్ ఆధ్యర్యంలో ఉమెన్స్ డేలో నీరజా సుబ్రహ్మణ్యాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుండా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఉండేదన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మావతి, బీజేపీ కన్వీనర్ రజని, కళింగ వైశ్య ప్రతినిధి పద్మజ, పద్మప్రియ, జ్వాలా, వైద్యులు డి.హర్షవల్లి, సంపతిరావు శ్రీదేవి తదితరులను ఘనంగా సన్మానించారు. అలాగే శ్రీకాకుళం హర్షవల్లి లైన్స్‌క్లబ్ అధ్యక్షురాలు కరణం శోభారాణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.


నృత్యకారిణి నీరజా సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న దృశ్యం

టీడీపీ కార్యాలయంలో..


ఎచ్చెర్ల: కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహిస్తున్న మహిళా ప్రతినిధులు

ఎచ్చెర్ల: నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి మహిళా నేతలు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం తీసుకువచ్చి కలలకు రెక్కల పథకం, శంఖారావం కార్యక్రమాలను ఇంటింటికీ తెలియజేసి మహిళలను చైతన్యం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత, పార్ల మెంటరీ పార్టీ ఉపాధ్యక్షురాలు బల్లాడ అరుణ, పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి గంటా సంధ్యా గజపతి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు గొర్లె కుమారి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు డోల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

'కలలకు రెక్కలు'తో విద్యార్థినులకు మేలు


గుండ లక్ష్మీదేవిని సత్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి: మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికరతకు 'కలలకు రెక్కలు' పేరుతో పథకం తీసుకువచ్చారని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకు ళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఆడపిల్ల పేదరికంతో చదువుకు దూరం కాకూడదనే ఆలోచనతో ఈ పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాల కల్పన ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటర్ పూర్తి చేసుకున్న మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అలాగే తెలుగు మహిళలు కవ్వాడి సుశీల తదితరులు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపి పూలమాలతో సత్కరించారు.

మహిళా సాధికారతకు సరికొత్త పథకం

నరసన్నపేట: మహిళా సాధికారతకు టీడీపీ-జనసేన సంయుక్తంగా 'మహిళల కలలకు రెక్కలు' పేరుతో సరికొత్త పథకాన్ని ప్రకటించాయని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ఆడబిడ్డల ఉన్నత చదవుల వరకు డబ్బు సమస్య రాకుండే ఉండేందుకు గాను ఈ పథకం తీసుకురావడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర కోర్సులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బగ్గు సుగుణ, అర్చన, బలగ భారతి, నేతింటి భారతి, గురుగుబెల్లి ఝాన్సీ, ఉణ్న రాజశ్రీ, పుచ్చల కల్పన తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి

అరసవల్లి: మహిళా సాధికారతపైనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు గొండు శంకర్ అ న్నారు. శుక్రవారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల కల్యాణ మండపంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ జనాభాలో సగం మంది స్త్రీలేనని, దేశ భవిష్యత్తు, ఆర్థిక స్వావలంబన మహిళల చేతుల్లోనే ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆయన గాజులు పంపిణీ చేశారు.


మహిళలకు గాజులు పంపిణీ చేస్తున్న గొండు శంకర్

హైవేపై రోడ్డు ప్రమాదం

- రెండు లారీలు ఢీకొని క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్, క్లీనర్
- కాపాడిన ఎస్పీ రాధిక, అధికారులు


లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన వారి సహాయక చర్యల్లో ఎస్పీ రాధిక

నరసన్నపేట, మార్చి 8: శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు హైవేపై వెళుతున్న రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో క్యాబిన్‌లో డ్రైవర్, క్లీనర్ ఇరుక్కున ఘటన శుక్రవారం నరసన్నపేట మండలం సత్యవరం ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం జరిగింది. అదే సమయంలో ఎస్పీ జీఆర్ రాధిక శ్రీముఖలింగం నుంచి వస్తుండగా ఘటనను పరిశీలించి తక్షణం వాహనాన్ని ఆపి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి ఉన్న లారీ డ్రైవర్, క్లీనర్లను ప్రాణాపాయం నుంచి కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బెంగళూరు నుంచి గౌహతికి ఎలక్ట్రానిక్ వస్తువులతో వెళుతున్న లారీని, అదే మార్గంలో పంచదారను తీసుకువెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం నుజ్జయిపోవడంతో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ సోహిల్‌ఖాన్, క్లీనర్ అబిద్‌ఖాన్ అందులో ఇరుక్కుపోయారు. ఎస్పీ రాధిక తక్షణం స్పందించి క్యాబిన్‌లో ఇరుక్కున్న వారికి భయపడ వద్దని చెప్పి వారిని సిబ్బంది సాయంతో సురక్షితంగా బయటకు తీసి స్థానికుల సాయంతో 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. ఎస్పీ రాధిక చొరవపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. అత్యవసర, ప్రమాద పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడే బాధ్యత పోలీసులపైనా ఉందన్నారు. నరసన్నపేట ఘటన చూసిన ప్రతి ఒక్కరిలో బాధితులకు సహాయం చేయాలనే భావన కలగాలన్నారు.

ఇద్రకీలాద్రిపై శ్రీకాకుళం వాసి మృతి

విజయవాడ వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన శ్రీకాకుళం జిల్లా కేంద్రం సానాబారి వీధికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. కుమారుడు వంశీకృష్ణ, కోడలు, మనుమలు, మనుమరాళ్లు పది మంది కుటుంబ సభ్యులతో కలసి ఆమె శుక్రవారం దుర్గమ్మను దర్శించుకోవడానికి వచ్చారు. మహామండపం వద్ద చెప్పులస్టాండు వద్దకు వచ్చేసరికి ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వన్‌టౌన్ సీఐ ధనశేఖరెడ్డి ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచింది. అనంతరం ఆమె మృతదేహాన్ని శ్రీకాకుళానికి తీసుకువెళ్లారు.

వాహనాల ఢీ.. వలంటీర్లకు గాయాలు

పోలాకి: గంగివలస వద్ద శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ప్రియాగ్రహారానికి చెందిన ముగ్గురు వలంటీర్లకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం ముగింపు అనంతరం ఆటోలు, వాహనాలు ఒకేసారి బయలుదేరడంతో ఇరుకు రోడ్డు కావడంతో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒకే బైక్‌పై వస్తున్న ముగ్గురు సచివాలయ వలంటీర్లు గాయాలబారినపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలు, మిగిలిన ఇద్దరికి నామమాత్రపు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలాకి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11మందికి..

హరిపురం: మందస మండలం హంసరాళి వద్ద ఎంఎం రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11మందికి గాయపడినట్టు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మహేంద్రగిరి యాత్ర ముగించుకొని టెక్కలి వైపు మినీ వాహనంపై వెళ్తుండగా.. సందూరు గ్రామానికి చెందిన సవర రామారావు ద్విచక్రవాహనంపై భార్య సుబ్బమ్మ, మరదలు నీలమ్మతో ఎదురుగా వస్తూ ఢీకొన్నాయి. మినీ వాహనం అదుపుతప్పి పొలాల్లో బోల్తాపడింది. ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మినీ వాహనంలో ఉన్న తొమ్మిది మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. తీవ్రగాయాలైన వారిని హరిపురం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మందస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపరిచిత వ్యక్తులను గుర్తించేందుకే కార్డెన్ సెర్చ్


సోదాలు చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం: అపరిచిత వ్యక్తులను గుర్తించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వేకువ జామున నాలుగు గంటలకు పెద్దరెల్లి వీధిలో రెండు బృందాలుగా 25 మంది పోలీసులు, సుమారు 200కు పైగా ఇళ్లల్లో సోదా(కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. ఇంటి ఉన్న వారి వివరాలు, వాహనాల ధ్రువ పత్రాలు, అద్దెకు ఉంటున్న వారి, కొత్తగా ఆ ప్రాంతానికి వచ్చిన వారి పూర్తి వివరాలను సీఐతోపాటు ఎస్ఐ హరికృష్ణ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ ప్రాంతంలో నివసిస్తున్న రౌడీషీటర్ల కదలికలపై ప్రజలని అడిగి తెలుసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనుమానితులు తారసపడితే సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎటువంటి సమాచారం తెలిసిన డయల్ 100, 6309990824 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

జనసేన మద్దతు కోరిన ఎమ్మెల్యే అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: టీడీపీ-జనసేన పార్టీల పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీకి సీట్ కేటాయిచడం జరిగింది. ఇరుపార్టీల మద్దతుతో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించేందుకు అంతా సహకరించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు జనసైనికులను కలిసి మద్దతు కోరారు. ఉమ్మడిగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం ఉమ్మడి అభ్యర్థి అశోక్‌ను అంతా సమష్టి కృషితో గెలుపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, మాజీ ఎంపీపీ దక్షత ఢిల్లీరావు, టీడీపీ నాయకులు జీవులురెడ్డి, ఆశి లీలారాణి, జిలానీ, జనసేన పార్టీ నాయకులు తిప్పన దుర్యోధన రెడ్డి, హరిబెహరా, నీలవేణి, దాసరి శేఖర్, రోకళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా వైద్యం


వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి జగదీష్

అరసవల్లి: మహా శివరాత్రి సందర్భంగా శ్రీకాకుళం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి పి.జగదీష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులను పరీక్షించి 100 మందికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ.. అన్ని రకాల వ్యాధులకు మందులు, వైద్యం అందుబాటులో ఉందని, ప్రత్యేకంగా దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లవాతం, గ్రాస్ట్రిక్ సమస్య, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మవ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతీరోజూ ఉదయం, మధ్యాహ్నం స్థానిక గాంధీపార్కు ఎదురుగా గల జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గల ఆయుష్ ఆయుర్వేద వైద్యశాలలో ఉచిత, చికిత్స, మందులు, యోగాపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ జె.చంద్రశేఖరరావు, యోగా శిక్షకురాలు గాయత్రి, పి.మురళీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో గ్రేహౌండ్స్ అదనపు డీజీ


మీనాకు స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామివారిని శుక్రవారం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్) గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆర్‌కే మీనా (ఐపీఎస్) శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు.

జనసేన పార్టీలో 150 వైసీపీ కుంటుంబాల చేరిక


వైసీపీ నుంచి చేరినవారితో జనసేన పార్టీ నాయకులు

రణస్థలం: కొచ్చర్ల పంచాయతీ పరిధి కొచ్చెర్ల, కొత్తముక్కాం, కొమరవానిపేట, సుందరపాలెం, కొల్లిభీమవరం గ్రామాల నుంచి వైసీపీకి చెందిన సుమారు 150 కుటుంబాలు జనసేన మండల అధ్యక్షుడు బసవ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. వీరందరికీ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రశేఖర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విధివిదాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్టు పట్నాన అప్పయ్యరెడ్డి, నాయిన ఈశ్వరరెడ్డి, బసవ రమణారెడ్డి, పట్నాన పైడయ్యరెడ్డి, పి.రమణ, పట్నాన గోవిందరెడ్డి, కృష్ణ చిన్నారవు, కొరెడ్ల గోవిందరెడ్డి తదితరులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వడ్డాది శ్రీనివాసరావు, దాసర బలరామ్, గొర్లె సూర్య, బాలి అన్నం నాయుడు, రింగురాజు, సుకంర రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్


బెజ్జిపురంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

లావేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బెజ్జిపురం, అదపాక గ్రామాల్లో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో 50 మంది వరకు ఆర్‌పీఎఫ్ పోలీసులతో కవాతు చేపట్టారు.

పిండి వంటలతో నైవేద్యం



శ్రీకాకుళం కల్చరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారికి పిండి వంటకాను నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన పట్టు వస్త్రాల సమర్పణ, 58 రకాలకు పైగా స్వీట్లు, పిండి వంటలు నైవేద్యంగా పెట్టారు. అష్టోత్తర శతనామ, కుంకుమ పూజలు చేశారు. మంత్ర పుష్పం మహా హారతి చతుర్వేద పారాయణం నిర్వహించారు. సామాజికవేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మామిడి గోవిందరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళా సాధికారత ఏదీ?

గార: ప్రభుత్వాలు మహిళా సాధికారత అంటూ ఉపన్యాసాలు తప్ప అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే మరచిపోతున్నారు అని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు జి.ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సతివాడలో ఉపాధి పథకం వేతనదారులతో కలిసి ఆమె మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గార: తూలుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం బ్రేకర్లు మెంటైనెన్స్ కారణంగా శనివారం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ ఎస్.బయ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఇచ్ఛాపురం: మశాఖపురం, పాయితారి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా శుక్రవారం కృషి సఖిలకు మొదటి రోజు బీజామృతం, ద్రవ జీవామృతం తయారీపై వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి చిట్టిబాబు, సీసీ మోహన్‌రావు, సీఆర్‌పీలు, కృషి సఖిలు మోహని, తులసి, జయలక్ష్మి పాల్గొన్నారు.

క్రెడాయ్ ఎక్స్‌పోతో యువతకు ఉపాధి

అరసవల్లి: నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ (శ్రీకాకుళం చాప్టర్) ఎక్స్‌పోతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఔత్సాహిక బిల్డర్లకు, ఇతర వ్యాపార వర్గాలకు ఇవి ఎంతో ఉపయోగకరమన్నారు. వ్యాపార రంగ అభివృద్ధికి జిల్లాలో మంచి అవకాశాలు ఉన్నాయని, ఇటువంటి ఎక్స్‌పోలను వినియోగించుకుని నగర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. క్రెడాయ్ కార్యవర్గానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

ఉద్యోగోన్నతికి దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట: జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య పాఠశాలల్లో ప్రత్యేకావసరాల పిల్లలకు బోధించేందుకు పాఠశాల సహాయకులుగా ఉద్యోగున్నతి కల్పించేందుకు అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న చోట్ల రోస్టర్ ప్రాతిపదికన ఉద్యోగున్నతి కల్పించేందుకు ప్రత్యేక విద్యలో బీఈడీ, జనరల్ బీఈడీతోపాటు రెండేళ్ల ప్రత్యేక విద్యలో డిప్లమో గల ఎస్జీటీ ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటల లోపు డీఈవో కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఆయుర్వేద వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైదులు

బూర్జ: ఆయుష్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఎస్.మంగమ్మ రోగులను పరీక్షించి మందులు అందించారు. దీర్ఘకాలిక రోగులకు ఆయుర్వేద వైద్యం ఉపయోగపడుతుందన్నారు. సుమారు వంద మందికి వైద్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సహాయకులు ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.